శిలాఫలకాల ఏర్పాటుపై ఉబలాటం లేదు

- కాంగ్రెస్ నాయకుల వ్యాఖ్యలు అర్థరహితం
- బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు, మాజీ జడ్పీటీసీ కొలను బాల్‌రెడ్డి

మాట్లాడుతున్న మాజీ జడ్పీటీసీ బాల్ రెడ్డి

బొల్లారం డిసెంబర్ 19: శిలాఫలకాల ఏర్పాటుకు ఏనాడూ పాకులాడలేదని బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు, మాజీ జడ్పీటీసీ కొలను బాల్‌రెడ్డి అన్నారు. గురువారం బొల్లారంలోని ఆయన నివాసంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు, నాయకులతో కలిసి మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలు అర్థరహితమని, 24 ఏండ్లుగా రాజకీయ ప్రస్థానంలో ఉండి ఏనాడూ శిలాఫలకాల పేర్లపై ఉబలాట పడలేదని చెప్పారు. మిషన్ భగీరథ పనులకు సంబంధించి ఇటీవల ముఖ్యమంత్రి బొల్లారం మున్సిపాలిటీకి నీటి సరఫరా ప్రారంభించారని, ఈ కార్యక్రమానికి చైర్‌పర్సన్‌ను ఆహ్వానించారని, మరుసటి రోజు నుంచే తాగునీరు అందిస్తామంటేనే అక్కడకు వెళ్లినట్లు తెలిపారు. స్వయంగా సీఎం శిలాఫలకాన్ని ప్రారంభించారని, మళ్లీ శిలాఫలకాలు ఎలా ప్రారంభిస్తారని ప్రశ్నించారు. ఇది కాంగ్రెస్ నాయకుల విజ్ఞతకే వదిలేస్తున్నానన్నారు. మున్సిపాలిటీకి నెల రోజుల్లోగా మిషన్ భగీరథ నీటి సమస్యను పరిష్కరించని పక్షంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కౌన్సిలర్లు వేణుపాల్ రెడ్డి, సాయి కిరణ్‌రెడ్డి, శ్రీకాంత్ యాదవ్, బీరప్ప యాదవ్, సతీశ్, నాయకులు జైపాల్ రెడ్డి, రత్నం, లక్ష్మీనాయుడు పాల్గొన్నారు.

చిట్కుల్‌లో పోలీసుల కార్డన్ సెర్చ్

చిట్కుల్ వడ్డెర కాలనీవాసులతో మాట్లాడుతున్న డీఎస్పీ రవీందర్‌రెడ్డి

పటాన్‌చెరు, డిసెంబర్ 19: చిట్కుల్ పరిధిలోని వడ్డెర కాలనీలో డీఎస్పీ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సరైన పత్రాలు లేని 60 బైకులు, పది ఆటోలు, మూడు కార్లను స్వాధీనం చేసుకున్నారు. గురువారం తెల్లవారుజామున ఐదు గంటలకు డీఎస్పీ ఆధ్వర్యంలో ఎనిమిది మంది సీఐలు, 20 మంది ఎస్ఐలు, వంద మంది కానిస్టేబుళ్లు వడ్డెర కాలనీని దిగ్బంధించారు. ఫస్ట్ షిఫ్ట్‌కు పరిశ్రమల్లో డ్యూటీల కోసం వెళ్తున్నవారిని తనిఖీ చేసి వదిలారు. అనంతరం అనుమానం వచ్చిన వారిని, ఐడెంటిటీ లేనివారిని మల్లన్నగుడి వద్దకు చేర్చారు. ఇళ్లలోనూ తనిఖీలు చేసి వాహనాల పత్రాలను అడిగారు. పత్రాలు లేని వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం మల్లన్న గుడి వద్ద కాలనీవాసులతో డీఎస్పీ సమావేశం నిర్వహించారు. ఎలాంటి ఆధారాలు లేని వ్యక్తులకు ఇండ్లు కిరాయికి ఇవ్వవద్దని సూచించారు. అనుమానితులుగా గుర్తిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. గంజాయి వాడకం కనిపిస్తే సమచారం ఇవ్వాలని కోరారు. అత్యవసరం అయినప్పుడు 100కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. యువత అసాంఘిక శక్తులతో జాగ్రతగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సీఐలు వినాయక్‌రెడ్డి, స్వామి గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఏపీజీవీబీ సేవలకు అంతరాయం

సిరిపురలో ర్యాలీ నిర్వహిస్తున్న ఏపీజీవీబీ సిబ్బంది

హత్నూర, డిసెంబర్ 19: ఏపీజీవీబీ సేవలకు ఈనెల 28 నుంచి 31వరకు అంతరాయం కలుగనున్నట్లు బ్యాంకు మేనేజర్ చంపలాల్ తెలిపారు. గురువారం హత్నూర మండలం సిరిపురలో బ్యాంకు సిబ్బంది, స్థానిక ప్రజలతో కలిసి బ్యాంకు సేవలపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు ఇప్పటివరకు తెలంగాణలో కొన్ని జిల్లాలకు మాత్రమే సేవలు అందించగా త్వరలోనే తెలంగాణ రాష్ట్రమంతా బ్యాంకు సేవలు విస్తరించనున్నట్లు తెలిపారు. ఏపీజీవీబీ నుంచి తెలంగాణ గ్రామీణ బ్యాంకు పేరుతో రాష్ట్రంలో అనేక బ్రాంచ్‌లు ఏర్పాటుచేసి సేవలు అందించనున్నట్లు తెలిపారు. నాలుగు రోజులపాటు బ్యాంకు సేవల్లో అంతరాయం ఉంటుందని, ఖాతాదారులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మచ్చ నరేందర్, మాన్‌సింగ్, నగేశ్ గౌడ్ పాల్గొన్నారు.

జీవ వైవిధ్యంపై వ్యాసరచన పోటీలు

విజేతలకు బహుమతితోపాటు ప్రశంసపత్రం అందజేస్తున్న ప్రిన్సిపాల్

ఝరాసంగం, డిసెంబర్ 19: డెక్కన్ డెవలప్మెంట్ సొసైటీ జహీరాబాద్ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో జీవ వైవిధ్యంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కుప్పానగర్, ఎల్గోయి గ్రామాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. పాత పంటలు, చుట్టూ ఉన్న ప్రకృతి, మరిచిపోతున్న పండుగలను ముందు తరాలకు గుర్తు చేయాలనే ఉద్దేశంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు డీడీఎస్ సంస్థ నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ టీనావతి బహుమతితోపాటు ప్రశంసపత్రాలను అందజేశారు. అనంతరం విద్యార్థులకు చిరు ధాన్యాలపై సినిమాని చూపించారు.

కార్మికుల సంక్షేమానికి పాటుపడాలి

జాతీయ కర్మచారి కమిషన్ చైర్మన్ వెంకటేశం

మాట్లాడుతున్న జాతీయ కర్మచారి కమీషన్ చైర్మన్ వెంకటేశం

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 19: జిల్లాలోని సఫాయి కార్మిక కుటుంబాలకు ఉపాధి కల్పించాలని జాతీయ కర్మచారి కమిషన్ చైర్మన్ వెంకటేశం సంబంధిత అధికారులకు సూచించారు. గురువారం జిల్లాకు వచ్చిన కమిషన్ చైర్మన్‌కు కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎస్పీ రూపేశ్ స్థానిక ఐబీలో పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని మున్సిపల్ సఫాయి కార్మికులకు నెల రోజుల్లో ఐడీ కార్డులు జారీ చేయాలని, వారికి ఈపీఎఫ్ ఖాతా నంబర్లు అందించాలని ఆదేశించారు. కార్మికులకు సేఫ్టీ కిట్స్, మాస్కులు, సబ్బులు, ఆయిల్, షూ, గ్లౌజులు, యూనిఫామ్స్ తదితర సామగ్రిని నిబంధనలకు అనుగుణంగా అందించాలన్నారు. వారికి సంవత్సరానికి రెండుసార్లు వైద్య పరీక్షలు చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, అదనపు ఎస్పీ సంజీవరావు, ట్రైనీ కలెక్టర్ మనోజ్, డీఆర్‌వో పద్మజారాణి, జడ్పీ సీఈవో జానకీరెడ్డి, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి జగదీశ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్, ఆర్డీవో రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బీహార్ స్థానిక సంస్థల ప్రతినిధుల క్షేత్ర పర్యటన

బీహార్ రాష్ట్ర ప్రతినిధుల బృందంతో పటాన్‌చెరు పంచాయతీరాజ్ అధికారులు

పటాన్‌చెరు, డిసెంబర్ 19: చిట్కుల్ గ్రామంలో బీహార్ నుంచి వచ్చిన జడ్పీటీసీలు, బ్లాక్ డెవలప్‌మెంట్ అధికారులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల బృందం నాలుగు రోజుల తెలంగాణ పర్యటనకు వచ్చింది. ఎన్ఐఆర్‌డీ శిక్షణ కేంద్రంలో ఉంటున్నారు. గురువారం పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామాన్ని బీహార్ రాష్ట్ర బృందం పర్యటించింది. ఎన్ఐఆర్‌డీ శిక్షణ కేంద్రం అధికారి అరుణ్, పటాన్‌చెరు ఎంపీవో హరిశంకర్‌గౌడ్ వారికి గ్రామాభివృద్ధిని చూపించారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు, డంప్ యార్డులు, చెత్త సేకరణ పద్ధతులు, వైకుంఠ ధామాలు, నర్సరీలను బృందం సభ్యులు పరిశీలించారు. తడిపొడి చెత్త నుంచి సేంద్రియ ఎరువుల తయారీని చూపించారు. పంచాయతీకి ఆదాయ మార్గాలు ఎలా ఉంటాయో వివరించారు. ప్రజలకు మౌలిక వసతులను కల్పించడంతోపాటు గ్రామాలు అభివృద్ధి చెందినట్టు వివరించారు. ప్రతి విభాగంలో జరుగుతున్న అభివృద్ధిని చెప్పారు. బీహార్ బృందం సభ్యులు గ్రామస్తులు చెప్పిన వివరాలను రికార్డు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో యాదగిరి, కార్యదర్శి కవిత తదితరులు పాల్గొన్నారు.

పాశమైలారంలో ట్రాఫిక్ సిగ్నల్స్ ప్రారంభం

ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ చెన్నూరి రూపేశ్

పటాన్‌చెరు, డిసెంబర్ 19: ఐడీఏ పాశమైలారంలో సొసైటీ ఫర్ సంగారెడ్డి సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఎస్పీ చెన్నూరి రూపేశ్ ప్రారంభించారు. గురువారం పటాన్‌చెరు మండలం పాశమైలారం పారిశ్రామికవాడలోని జంక్షన్‌లో ఎస్ఎస్ఎస్‌సీ ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న జంక్షన్‌లో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయగా వాటిని ఎస్పీ ప్రారంభించి మాట్లాడారు. పరిశ్రమల యాజమాన్యాలు ట్రాఫిక్ వ్యవస్థను బలోపేతం చేసేందుకు అండగా ఉండడం అభినందనీయమన్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఎవరు జంప్ చేసినా హై రిజల్యూషన్ కెమెరాలు ఫొటో తీసి జరిమానా విధిస్తుందన్నారు. పరిశ్రమల యాజమాన్యాలు ఏర్పాటు చేసిన సొసైటీలో అన్ని పరిశ్రమలు సభ్యత్వం తీసుకోవాలని సూచించారు. పరిశ్రమలలో పనిచేస్తున్న మహిళా కార్మికులు, సిబ్బందికి సంపూర్ణ రక్షణ అందజేస్తామన్నారు. రవాణా, ట్రాఫిక్ జాం, ఫైర్ సేఫ్టీ, ఇండస్ట్రియల్ సెక్యూరిటీ, సైబర్ నేరాల అదుపునకు పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, ఎస్ఎస్ఎస్‌సీ జనరల్ సెక్రటరీ సత్యనారాయణ, వివిధ కంపెనీల ప్రతినిధులు, సీఐలు లాలునాయక్, నాగరాజు, స్వామిగౌడ్ పాల్గొన్నారు.

పంచాయతీ ఏర్పాటుపై సమావేశం

గ్రామస్తుల అభిప్రాయాలను సేకరిస్తున్న డీఎల్పీవో అమృత

ఝరాసంగం, డిసెంబర్ 19: మండలం పరిధిలోని తుమ్మన్‌పల్లి గ్రామ పంచాయతీలోని అదనపు గ్రామంగా ఉన్న సంగం(కే)ను నూతన పంచాయతీగా ఏర్పాటు చేయాలని గతంలో ప్రజాపాలన కార్యక్రమంలో గ్రామస్తులు అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ విషయంపై డీఎల్పీవో అమృత గ్రామస్తులతో గురువారం సమావేశమయ్యారు. నూతన పంచాయతీగా సంగం(కే)ను ఏర్పాటు చేయడంపై గ్రామస్తుల అభిప్రాయాలను సేకరించారు. కొంత మంది చేయాలని, ఇంకొంత మంది పంచాయతీ ఎన్నికలు ముగిసిన తర్వాత తమ గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా గుర్తించాలని అభిప్రాయాలను వెలిబుచ్చారు. ఈ విషయంపై జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తామని అధికారులు తెలిపారు. ఎంపీడీవో సుధాకార్ ఉన్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

కలెక్టర్ వల్లూరు క్రాంతి

మైనార్టీ పాఠశాలలో సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

అందోల్, డిసెంబర్ 19: గురుకుల పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో చదివే విద్యార్థులకు తప్పనిసరిగా మెనూ ప్రకారం భోజనం అందించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. గురువారం జోగిపేట మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటశాల, ఇతర వసతులను పరిశీలించి విద్యార్థులతో కలిసి అక్కడే భోజనం చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం ఉండాలని ఎక్కడైనా అలా పెట్టకపోతే చర్యలు తప్పవన్నారు. విద్యార్థులకు ఏమైనా ఇబ్బందులుంటే నేరుగా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం సంగుపేటలో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలించిన కలెక్టర్ ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ పొరపాట్లకు తావులేకుండా వివరాలు సేకరించాలన్నారు. సేకరించిన వివరాలను వెంటనే ఆన్‌లైన్లో జాగ్రత్తగా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో పాండు, మెప్మా పీడీ గీత, తహసీల్దార్ విష్ణుసాగర్, ఎంపీడీవో రాజేశ్వర్, ఎంఈవో కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సర్వేను వేగవంతం చేయండి

చౌటకూర్, డిసెంబరు 19: ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక సర్వేను గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. మండల కేంద్రం చౌటకూర్‌లో గురువారం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల సర్వే ప్రక్రియను పరిశీలించారు. లబ్ధిదారుల స్థితిగతులను తప్పనిసరిగా యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఈ నెల 31వ తేదీలోగా లబ్ధిదారుల సర్వేను పూర్తి చేయాలన్నారు. గ్రామంలో 890 మంది పక్కా ఇండ్ల కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోగా, ప్రతి లబ్ధిదారుని ఇంటి వద్దకు వెళ్లి లైవ్ ఫొటో అప్‌లోడ్ చేయాలన్నారు. ఇప్పటి వరకు వందకు పైగా లబ్ధిదారుల ఇండ్ల స్థితిగతులను సర్వే చేసి యాప్‌లో నమోదు చేశామని పంచాయతీ కార్యదర్శి సందీప్‌గౌడ్ కలెక్టర్‌కు వివరించారు. సర్వే సమయంలో సర్వర్ సమస్య తలెత్తుతుందని, దీంతో నమోదులో ఆలస్యం అవుతున్నదన్నారు. ఇండ్ల మంజూరులో ప్రభుత్వానిదే తుది నిర్ణయమన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన కాశన్నగారి గంగయ్య ఇంటిని కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో అందోలు-జోగిపేట ఆర్డీవో పాండు, మండల ప్రత్యేకాధికారి బాలరాజ్, ఇన్‌చార్జి తహసీల్దార్ మన్నె కిరణ్ కుమార్, ఎంపీడీవో ఆనందమేరీ, ఆర్ఐ రాజు, పంచాయతీ కార్యదర్శి సందీప్‌గౌడ్, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ అనురాధ, నాయకులు కలాలి రామాగౌడ్, వర్కల రమేశ్, కైసర్, గౌని కరుణాకర్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన తప్పనిసరి

రాయికోడ్, డిసెంబర్ 19: ప్రతిఒక్కరికీ సైబర్ నేరాలపై అవగాహన ఉండాలని స్థానిక ఎస్ఐ నారాయణ అన్నారు. గురువారం మండల పరిధిలోని ఇందూర్, ముస్తాపపూర్, కర్చల్ గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఎస్సై నారాయణ మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ శాంతి భద్రతాలకు సహకరించాలని కోరారు. ప్రజలు నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసుకునే అవకాశం ఉన్నదని చెప్పారు. చట్ట వ్యతిరేఖమైన పనులకు దూరంగా ఉండాలని సూచించారు. పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలన్నారు. గ్రామా ల్లో అపరిచిలు కన్పిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, పీఎస్ఐలు మధుసూదన్, వంశీ కృష్ణ, ప్రవీణ్‌కుమార్ సిబ్బంది ఉన్నారు.

ఆర్టిజన్ రిక్రూట్‌మెంట్ నిర్వహించాలి

భెల్ ఈడీకి వినతిపత్రం అందజేస్తున్న భెల్ కార్మికులు

రామచంద్రాపురం, డిసెంబర్ 19: భెల్‌లో ఆర్టిజన్ రిక్రూట్‌మెంట్ నిర్వహించాలని సీఐటీయూ నాయకులు పెంటయ్య, భాషా, శ్రీనివాస్ తదితరులు డిమాండ్ చేశారు. గురువారం భెల్ ప్రధాన గేటు ఎదుట సీఐటీయూ నాయకులు, భెల్ కార్మికులు ధర్నా చేశారు. అనంతరం ఈడీ కేబీ రాజాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భెల్‌లో ఆర్టిజన్ రిక్రూట్‌మెంట్ జరగకపోతే పరిశ్రమ మనుగడే ప్రమాదంగా మారుతుందని తెలిపారు. ఎఫ్‌టీఏను అన్ని యూనిట్లలో పూర్తిగా వ్యతిరేకించాలన్నారు. ఎఫ్‌టీఏతో స్కిల్ ట్రాన్స్‌ఫర్ అవదని, పరిశ్రమ బాగుండాలంటే పర్మినెంట్ ఎంప్లాయిమెంట్ ఒకటే మార్గమని తెలిపారు. భెల్ యాజమాన్యం వెంటనే ఆర్టిజన్ రిక్రూట్‌మెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో వీరాన్‌రావ్, కుమారస్వామి, సతీశ్ బాబు, తిరుపతి, లింగరాజు, ప్రభాకర్, నాగయ్య, అజిత, రమేశ్ పాల్గొన్నారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

అమిత్‌షా వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ నిరసన తెలుపుతున్న బీసీ సంఘం నాయకులు

బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బీరయ్య యాదవ్

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 19: పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమానించిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా వెంటనే దేశానికి క్షమాపణ చెప్పాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బీరయ్య యాదవ్ డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం కొత్త బస్టాండ్ వద్ద రాస్తారోకో చేపట్టారు. అంతకుముందు పట్టణంలో దళిత, బహుజన సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ అంటే బీజేపీకి అక్కసు ఉన్నదని, అమిత్‌షా వ్యాఖ్యలను బట్టి తెలుస్తున్నదన్నారు. రాజ్యంగం మీద జరిగిన చర్చకు జవాబుగా నిండు సభలో రాజ్యంగం, అంబేద్కర్‌ను అవమానపరిచిన అమిత్‌షా ఆ పదవిలో కొనసాగేందుకు అనర్హుడని పేర్కొన్నారు. వెంటనే మంత్రి పదవి నుంచి తొలిగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత, గిరిజన, బీసీ సంఘాల నాయకులు అశోక్, రామారావు, అనంతయ్య, లక్ష్మయ్య, జైపాల్‌నాయక్, రాజేందర్‌నాయక్, పవన్, శ్రీకాంత్, అఖిల్ పాల్గొన్నారు.

గొర్రెల పెంపకందారుల అరెస్టు సరికాదు

అందోల్: జోగిపేట ఠాణాలో గొర్లకాపరులు, కుర్మ సంఘం నాయకులు

అందోల్, డిసెంబర్ 19: గొర్రెల పెంపకందారులపై రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాదింపు చర్యలకు పాల్పడుతున్నదని గొర్రెల పెంపకదారుల సంఘం ఉమ్మడి జిల్లా డైరెక్టర్ భూమయ్య ఆరోపించారు. గురువారం తమ సమస్యల పరిష్కారం, డిమాండ్ల సాధన కోసం సహకార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉడుత రవీందర్ పిలుపు మేరకు హైదరాబాద్‌లో ధర్నాకు బయలుదేరుతుండగా పోలీసులు అరెస్ట్ చేసి జోగిపేట ఠాణాకు తరలించడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో గొర్రెల పెంపకదారుల బతుకులు దుర్భరంగా మారాయన్నారు. గొర్రెల యూనిట్ల కోసం డబ్బులు చెల్లించినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు.

గొల్లకురుమలను వంచించిన కాంగ్రెస్

జహీరాబాద్, డిసెంబర్ 19: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా గొల్ల కురుమలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని బీఆర్ఎస్ జహీరాబాద్ మండల అధ్యక్షుడు, గొల్లకురుమల సంఘ నాయకుడు తట్టు నారాయణ, జహీరాబాద్ తాలుకా గొల్ల కురుమల యువజన సంఘం అధ్యక్షుడు రాజారమేశ్ ఆరోపించారు. గురువారం హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు ధర్నా చౌక్‌కు వెళ్తున్న గొల్ల కురుమలను జహీరాబాద్ పట్టణ, రూరల్ పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గొర్రెల కోసం డీడీ కట్టి సంవత్సరాలు గడుస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ఎన్నికల హామీలో భాగంగా దళారులకు ప్రమేయం లేకుండా గొల్ల కురుమలకు గొర్రెలకు బదులు ప్రతి యూనిట్‌కు రూ.2 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గొర్రెలు, మేకలను ఉచితంగా ఇన్సూరెన్స్ చేసి, మూడు నెలలకోసారి ఉచితంగా నట్టల నివారణ మందులు వేయాలన్నారు. పశు సంవర్ధక శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. 50 ఏండ్లు నిండిన గొర్రెల కాపారులకు నెలకు రూ.5 వేలు, ప్రమాదాలలో మృతి చెందిన వారికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాలమూరులో గొర్రెల పరిశోధన కేంద్రానికి రెండు వందల ఎకరాల స్థలాన్ని కేటాయించి అభివృద్ధి చేయాలని కోరారు. పాలన సమయం ముగిసిన సొసైటీలకు వెంటనే ఎన్నికలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరుడు దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

జహీరాబాద్: పోలీస్‌స్టేషన్‌లో గొల్లకురుమలు

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి

రామచంద్రాపురం, డిసెంబర్ 19: భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి గురువారం తన నివాసంలో సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. డివిజన్‌లోని ఎంఐజీకి చెందిన లబ్ధిదారుడు రాకేశ్‌రెడ్డికి మంజూరైన రూ.16 వేల సీఎం సహాయనిధి చెక్కు అందజేశారు. కార్పొరేట్ దవాఖానలో వైద్యం చేయించుకోవడానికి సీఎంఆర్ఎఫ్ దోహదపడుతుందని తెలిపారు. సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం వంటిదని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వెంకట్ రెడ్డి, సుధాకర్, మహేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సస్య రక్షణ చర్యలతో ఆలుగడ్డ సాగులో దిగుబడి

అలుగడ్డ పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు రాహుల్ విశ్వకర్మ

జహీరాబాద్, డిసెంబర్ 19: సమగ్ర సస్య రక్షణ చర్యలతో ఆలుగడ్డ సాగులో అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా ఏరువాక కేంద్రం, సంగుపేట్ డాట్ సెంటర్ శాస్త్రవేత్త రాహుల్ విశ్వకర్మ అన్నారు. గురువారం మండలంలోని హుగ్గేల్లి, రాయిపల్లి(డి) గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న ఆలుగడ్డ పంటలను పరిశీలించారు. ఆయా పంటలకు పచ్చ, తెల్ల దోమ ఉధృతి ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. వాటి నివారణకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారి ప్రదీప్‌కుమార్, డాట్ సెంటర్ వైపీ 1 శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఓపెన్ డ్రైన్ పనుల పరిశీలన

రామచంద్రాపురం, డిసెంబర్ 19: ఆర్సీపురం డివిజన్‌లోని అశోక్‌నగర్, జ్యోతినగర్ కాలనీలకు మధ్య భాగంలో నిర్మాణ దశలో ఉన్న ఓపెన్ డ్రైన్ పనులను గురువారం కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పానగేశ్ పరిశీలించారు. ఓపెన్ డ్రైన్ పనులను నాణ్యతగా చేపట్టాలని అధికారులకు, కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అశోక్‌నగర్, జ్యోతినగర్‌కాలనీల్లో తరుచూ డ్రైనేజీ సమస్యలు వస్తున్నాయని రూ.కోటితో ఓపెన్ డ్రైన్ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఓపెన్ డ్రైన్ నిర్మాణ పనులు చురుగా సాగుతున్నాయని, త్వరలోనే పనులు పూర్తవుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఈఈ సురేశ్, ఏఈ ప్రభు, కాలనీవాసులు శేషారెడ్డి, ఖలీమ్, ప్రమోద్ గౌడ్, పవన్, పాంగురంగాచారి ఉన్నారు.

రేపు క్రీడాకారుల ఎంపిక

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 19: సీఎం కప్ ఆటల పోటీల్లో భాగంగా ఈ నెల 27 నుంచి జరిగే హాకీ పోటీలకు క్రీడాకారుల ఎంపిక ప్రక్రియను ఈ నెల 21న ఉదయం 7 గంటల నుంచి బీహెచ్ఈఎల్‌లో నిర్వహించనున్నట్టు జిల్లా క్రీడలు, యువజన శాఖ అధికారి ఖాసీం బేగ్ గురువారం ప్రకటనలో తెలిపారు. 16 ఏండ్ల వయసు పైబడిన క్రీడాకారులు అర్హులన్నారు. సీఎం కప్ పోర్టల్‌లో నమోదు చేసుకున్న వారు మాత్రమే ఆధార్ కార్డుతో హాజరు కావాలని సూచించారు. వివరాలకు 99634 35354, 8790110233 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

అమిత్‌షా వెంటనే క్షమాపణ చెప్పాలి

హత్నూర, డిసెంబర్ 19: డ